# లైసెన్స్

*- మల్లాది వెంకట కృష్ణమూర్తి*

ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాలోని ఓ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌కి ఓ గ్రామస్థుడి నుంచి ఓ అప్లికేషన్ ఫాం అందింది. దాన్ని హెడ్ క్లర్క్ ఆయనకి నోట్ పుటప్ చేశాడు. అది అసాధారణమైన కేసు కాబట్టి, చట్ట పరిధిలో లేనిది కాబట్టి దాన్ని రిజెక్ట్ చేయమని ఆ నోట్‌లో పేర్కొన్నాడా హెడ్ క్లర్క్. నోట్‌లోని అతని రికమండేషన్‌ని, అప్లికేషన్‌ని చదివిన ఎస్.పి.కి ఎంతో ఆశ్చర్యం, ఆసక్తి కలిగాయి. ఆయన ఆ గ్రామ పరిధిలో వున్న డి.ఎస్.పి.కి ఆ ఫైల్‌ని పంపుతూ విషయం ఏమిటో తెలుసుకోమని రాసి పంపాడు.

డి.ఎస్.పి. ఆ ఫైల్ అందగానే, ఆ అప్లికేషన్‌ని చదివాడు. వెంటనే అతనికి ఆ గ్రామస్థుడి మీద, అతను చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనేవాడేమోనన్న అనుమానం కలిగింది.

ఆ గ్రామస్థుడ్ని తన ఎదుట హాజరుపరచమని ఆ గ్రామ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కి చెప్పాడు డి.ఎస్.పి.

మర్నాడు ఉదయం తొమ్మిదిన్నరకి సి.ఐ., ఎస్.ఐ.లు ఆ గ్రామస్థుడ్ని డి.ఎస్.పి. దగ్గరికి తీసుకొచ్చారు. అతనిలో ఎలాంటి భయం లేదని గ్రహించిన డి.ఎస్.పి. అడిగాడు ఆ కాగితాన్ని చూపిస్తూ.

'ఇది నీ చేతిరాతేనా? నువ్వు పంపిన అప్లికేషనేనా ఇది?'

'అవును సర్' ఒప్పుకున్నాడతను.

'ఫిరంగి కొనడానికి లైసెన్స్ కావాలని అప్లయ్ చేశావు. అవునా?'

'అవును సర్' జవాబిచ్చాడతను.

'ఫిరంగి దేనికి నీకు? దాంతో ఏం చేస్తావు? దానికి మందుగుండు నీకు ఎవరిస్తారు? అది ఎంత ఖరీదో తెలుసా?'

ఆ ప్రశ్నలకు ఆ రైతు ఎంతమాత్రం తత్తరపడలేదు. డి.ఎస్.పి.కి ఇలా జవాబిచ్చాడు.

'నిజానికి నాకు కావాల్సింది ఫిరంగి కాదు సార్. అదేం చేసుకుంటాను సార్?'

'కాదా? మరి సెవెంటి ఎం.ఎం. ఫిరంగి కావాలని ఇందులో ఎందుకు రాశావు?' ప్రశ్నించాడు డి.ఎస్.పి.

'జరిగిందేమిటో వినండి సార్ చెప్తాను. క్రితం నెల మా ఆఖరమ్మాయి పెళ్లి చేశాను. అందుకుగాను వంద కిలోల చక్కెర కోసం డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ సివిల్ సప్లయిస్ ఆఫీస్‌కి పర్మిట్ కోసం అప్లయ్ చేశాను సార్. అయితే పది కిలోల చక్కెరనే నాకు శాంక్షన్ చేశారు.

ప్రభుత్వ అధికారులు అప్లికేషన్‌లో వున్న దాంట్లో కేవలం పది శాతమే శాంక్షన్ చేస్తుంటారని విచారిస్తే తెలిసింది.

అతను చెప్పేది ఆసక్తిగా వింటున్నాడు డి.ఎస్.పి.

'నిజానికి నాకు కావాల్సింది రివాల్వర్ సర్. దానికి శాంక్షన్ రావాలంటే, ఫిరంగికి అప్లయ్ చేయడం మంచిదనుకుని చేశాను. దయచేసి రివాల్వర్‌కి లైసెన్స్ మంజూరు చేయవలసిందిగా కోరుతున్నాను సర్. నా పొలంలో తాచుపాములు ఎక్కువయ్యాయి. ఆత్మరక్షణకి రివాల్వర్ అవసరం సార్' చెప్పాడా రైతు వినయంగా.

○

## పంచవర్ష ప్రణాళికలు

పంచవర్ష ప్రణాళికలు
పది పూర్తయాయి కాని
దారిద్ర్యంతో అలమటిస్తున్న వారికి
కట్టుకుందికి 'పంచె'లు లేవు
ఉండడానికి 'పంచ'లు లేవు!

*- బులుసు-జీ-ప్రకాష్*